

రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీశారద విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు శ్రీ శారద కళాశాల విద్యార్థులు ఎస్‌జిఎఫ్-19 రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ కుప్పాల శంకర్రావు తెలిపారు. బాస్కెట్‌బాల్ విభాగంలో బేతాళ ప్రభుదీపిక మోటివేషనల్ కెప్టెన్‌గా, క్రికెట్ విభాగంలో టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్లుగా జివిఎస్.అవినాష్, జి.పూజిత్, సిహెచ్.వెంకట్ ఎంపికయ్యారు. బాస్కెట్‌బాల్ కోచ్ డాక్టర్ వాకా నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ తగరం ఆదర్శను, విద్యార్థుల ప్రతిభను గుర్తించిన ఎస్‌జిఎఫ్ కృష్ణా జిల్లా సెక్రటరీ రవికాంతను కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల ఊసే లేదు..!

- కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులైజేషన్‌పై నోరు మెదపని సర్కార్
- రాష్ట్రవ్యాప్తంగా పది వేల మంది జాబితా సిద్ధం చేసిన వైసిపి ప్రభుత్వం
- మూడు వేల మంది క్రమబద్ధీకరణ.. ఎన్నికల కోడ్‌తో ఏడు వేల మందికి బ్రేక్
- ఉమ్మడి పశ్చిమలో దాదాపు 800 మంది ఉద్యోగుల ఎదురుచూపులు
- డిగ్రీ, ఇంటర్ కాలేజీ అధ్యాపకులే అత్యధికం
- సిఎంతో సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడకపోవడంపై విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను పూర్తిగా పక్కన పెట్టేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన 114 జిఒను పట్టించుకోకుండా ముందుకు సాగుతోంది. ఉద్యోగుల సమస్యలపై సిఎంతో శనివారం జరిగిన చర్చల్లో ఉద్యోగ సంఘాల నేతలు సైతం మధ్యలో నిలిచిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ గురించి మాట్లాడకపోవడంపై తీవ్ర విమర్శలు విన్పిస్తున్నాయి. ఉద్యోగ సంఘాల భవనాల ఆస్తి పన్ను బకాయిల గురించి మాట్లాడిన ఉద్యోగ సంఘాల నేతలు ఉద్యోగుల సమస్యలను మాత్రం గాలికొదిలేశారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది.



ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలంటూ ఎప్పటి నుంచో సంబంధిత ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామంటూ 2019 ఎన్నికల్లో వైసిపి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. దీంతో ప్రభుత్వ పదవీకాలం చివర్లో 2023 అక్టోబర్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి జిఒ 114ను జారీ చేసింది. 2014కు ముందు చేరిన కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్ చేయనున్నట్లు అందులో పేర్కొంది. అందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 10,200 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయనున్నట్లు శాఖలవారీగా ప్రకటించింది. రెగ్యులరైజేషన్ జాబితాలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 800 మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. వీరిలో జూనియర్ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులు 200 మంది వరకూ ఉండగా, డిగ్రీ అధ్యాపకులు 70 మంది ఉన్నారు. ఇతర శాఖల్లో మిగిలిన ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం అడిగిన అన్ని పత్రాలనూ సేకరించి కాంట్రాక్ట్ ఉద్యోగులు అందించారు. దీనికోసం నానాతంటాలు పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖలో మూడు వేల మందిని రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం తొలివిడత ఉత్తర్వులు ఇచ్చింది. మరో ఏడు వేల మందికి సంబంధించిన ఉత్తర్వులు ఇవ్వడంలో తాత్సారం చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా మధ్యలో నిలిచిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ గురించి పట్టించుకోని పరిస్థితి ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జాబితా ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు కోరుతూనే ఉన్నారు.

ప్రభుత్వం వద్ద నోరు విప్పని ఉద్యోగ సంఘాల నేతలు

ఉద్యోగుల సమస్యలకు సంబంధించి శనివారం ఉద్యోగసంఘాల నేతలతో మంత్రుల కమిటీ, సిఎంతో చర్చలు సాగాయి. నాలుగు పెండింగ్ డిఎలకుగాను ఒక్క డిఎ మాత్రమే ఇచ్చేలా అంగీకారం కుదిరింది. ఉద్యోగ సంఘ భవనాలకు ఆస్తిపన్ను సైతం రద్దు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ గురించి మాత్రం ఉద్యోగ సంఘ నేతలు మాట్లాడ లేదనే విమర్శలు ఉద్యోగుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అప్పట్లో పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ఉన్న కెఎస్.లక్ష్మణరావు మధ్యలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను పూర్తి చేసే అంశంపై శాసనమండలిలో ప్రశ్నించారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానం ఇస్తూ సంబంధిత జిఒపై కొన్ని అనుమానాలు ఉన్నాయని, అడ్వకేట్ జనరల్‌కు పంపించామని, అక్కడి నుంచి వచ్చిన తర్వాత రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రకటించారు. ఉద్యోగ సంఘాల నేతలతో జరిగిన చర్చల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియపై నోరు మెదపకపోవడం సంబంధిత ఉద్యోగులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారధి



ప్రజాశక్తి - ఏలూరు

దీపావళి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందోత్సాహాలతో దీపావళి పండుగ జరుపుకోవాలని, దీపాల పండుగ దీపావళి ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని మంత్రి పార్థసారధి ఆకాంక్షించారు.

చెడుపై మంచి సాధించిన విజయమే దీపావళి

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా ప్రజలకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి పండుగ ప్రతీకని, దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. పండగ వేళలో బాణసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణహిత టపాసులు వినియోగించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జోరు వర్షం.. స్తంభించిన జనజీవనం



ముదినేపల్లి : జలమయమైన అంతర్గత రహదారి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వర్షం ఎడతెరిపి లేకుండా పడడంతో జనజీవనం స్తంభించింది. విడవకుండా కురిసిన వర్షంతో గ్రామాల్లో రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. పల్లపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామాల్లో డ్రెయినేజీలు పొంగిపొర్లి నీరు రోడ్లపై చేరింది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. పల్లపు ప్రాంతాల్లోని కాలనీలోని ఇళ్లల్లోకి నీరు చేరడంతో గృహోపకరణాలు తడిసిపోయాయి. వర్షంతో చిరు వ్యాపారులు బేరాలు లేక ఉసూరుమన్నారు. వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులకు వర్షంతో పనులు లేకుండా పోయాయి. వర్షంతో ముదినేపల్లి సెంటర్ చిత్తడి చిత్తడిగా మారింది. సెంటర్ అంతా గోతులు ఏర్పడడంతో గోతులో వర్షపు నీరు చేరి దారి కనపడగా ద్విచక్ర వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. వర్షానికి మండలంలోని వణుదుర్రులో రోడ్లు బురదమయం కావడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఊర చెరువులు నిండిపోయి నీరు రోడ్లపై చేరింది.

కలిదిండి : ఆదివారం తెల్లవారు జాము నుంచే కురుస్తున్న వర్షంతో ప్రధాన సెంటర్లు జనసంచారం లేక వెలవెలబోయాయి. రాష్ట్రీయ రహదారిపై పలుచోట్ల, పల్లపు ప్రాంతాల్లోని రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు పలు ఇక్కట్లకు గురయ్యారు. పడమటిపాలెం బంకు కాలనీ చుట్టూ నీరు చేరి, రాకపోకలకు ఆటంకంతో పాటు పాముల భయం వెంటాడుతోందని కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారు. అధ్వానంగా మారిన లోడిదలంక రోడ్డుపై భారీ గుంటల్లో లోడు లారీలు దిగబడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస వర్షాలతో ఆక్వా చెరువులు నిండుకుండలా మారి చెరువు గట్లు తెగిపోయే ప్రమాదముందని ఆక్వారైతులు అంటున్నారు. రొయ్య సాగు రైతులు ఆక్సిజన్ కొరతను అధిగమించేందుకు చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్స్‌పై ఆధారపడి చెరువుల వద్దే పడికాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.



ముసునూరు : నీట మునిగిన పంట

ముసునూరు : గత రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల మండలంలోని పలు గ్రామాల్లో పత్తి, వరి పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. వర్ష ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఈదురు గాలులకు వరి పంటలు నేలకొరిగాయి. పత్తి పంట దూది తీసే సమయం కావడంతో వర్షం వల్ల పత్తి మొక్కలు నీట మునిగి వేరు వ్యవస్థపై ప్రభావం చూపి చెట్లు చనిపోతాయాని, దూది పింజిలో మొక్కలు వస్తే కొనుగోలుదారుడు ముందుకు వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆనంద దీపావళి.. చేసుకుందామిలా

దీపావళి పండుగ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పలువురు డాక్టర్లు సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లల పట్ల జాగ్రత్తంగా ఉండాలని సూచించారు. దీపావళి సందర్భంగా పలువురు డాక్టర్ల సూచనలు మీకోసం.

కాటన్ దుస్తులు ధరించాలి

తులసీ హాస్పటల్ డాక్టర్ బళ్ల మురళి



డాక్టర్ బళ్ల మురళి

ప్రజాశక్తి - నరసాపురం

దీపావళి పండుగ సందర్భంగా టపాసులు కాల్చే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తులసీ హాస్పటల్ డాక్టర్ బళ్ల మురళి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పిల్లలు మారాం చేస్తున్నారని, యువకులు ఆశ పడ్డారని, కుటుంబ సభ్యుల కోరిక మేరకు టపాకాయలు కాల్చుతారు. అయితే ఏ మాత్రం ఏమరపాటుతో ఉన్నా ఇంటిల్లపాదికీ దీపావళి విషాదాన్ని మిగుల్చుతుంది. అప్రమత్తంగా ఉంటూ టపాకాయలు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలి. టపాసులు కాల్చే ప్రదేశం బహిరంగంగా ఉండాలి. పక్కనే నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి. టపాసులు వెలగలేదని ఊదడం, నలపడం చేయకూడదు. నిప్పురవ్వలు ఎగిసిపడకుండా మిగిలిన టపాకాయలను దూరంగా ఉంచాలి. పిల్లలు, పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలి. చేతుల్లో టపాసులు ఉంచుకుని కాల్చడం, విసిరేయడం చేయకూడదు. గడ్డివాములు, పాకలు, పందిళ్లకు దూరంగా టపాసులు కాల్చాలి. విద్యుత్ వైర్లు, కరెంట్ స్తంబాల పక్కన టపాసులు కాల్చకూడదు. ఊపిరితిత్తుల సమస్య ఉన్న వారు తప్పక మాస్కులు ధరించాలి. పిల్లలు ఫేస్ షీల్డ్ ధరిస్తే మంచిది. బాణసంచా కాల్చిన తర్వాత చేతులను శుభ్రంగా కడుకుని ఆహారం తీసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి

జనరల్ మెడిసిన్ డాక్టర్ మల్హోత్రా



జంగారెడ్డిగూడెం : దీపావళి సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మమత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి జనరల్ మెడిసిన్ డాక్టర్ మల్హోత్ర ప్రజాశక్తితో మాట్లాడారు. టపాసులు పేల్చేటప్పుడు చిన్న పిల్లల పర్యవేక్షణ తప్పనిసరి. కాటన్ దుస్తులు వేసుకోవాలి. టపాసులు ఓపెన్ ఏరియాలోనే కాల్చాలి. టపాసులు కాల్చేటప్పుడు గాయాలైతే ముందు చల్లటి నీటితో కాలిన భాగాన్ని 10-15 నిమిషాలు కడగాలి. ఆపై ఎలాంటి ఆయిల్, టూత్‌పేస్ట్ లేదా హల్దీ వంటివి వేయకూడదు. నొప్పి తగ్గకపోతే లేదా బుడగలు వస్తే వెంటనే దగ్గరలోని ఆసుపత్రిని సంప్రదించాలి. పొగ, శబ్ధం ఎక్కువగా ఉండే టపాసులకు దూరంగా ఉండాలి. ఆస్తమా, హార్ట్ లేదా బిపి ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. శబ్ధం, కాలుష్యం తగ్గించి పర్యావరణ హితమైన దీపావళి జరుపుకోవాలి.

చిన్న పిల్లలను టపాసులకు దూరంగా ఉంచాలి

త్రినేత్ర ఆసుపత్రి డాక్టర్ సిహెచ్.నాగేంద్రబాబు, చిన్న పిల్లల వైద్య నిపుణులు



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దీపావళి పండుగ నేపథ్యంలో చిన్నారులను టపాసులకు వీలైనంత దూరంగా ఉంచాలి. పటాకులు వెలిగించే చోట పెద్దవారి పర్యవేక్షణ తప్పనిసరి. పిల్లల చేతికి పెద్ద బాంబులు, రాకెట్లు ఇవ్వకూడదు. పిల్లలకు కాటన్ దుస్తులు వేయాలి. సింథటిక్ దుస్తులు మంటలు త్వరగా పట్టుకుంటాయి. చిన్నపాటి గాయమైనా చల్లని నీటితో ఆ ప్రదేశాన్ని కడగాలి. పేస్టులు, నూనె వంటివి రాయొద్దు. గాయం ఎక్కువైతే వెంటనే దగ్గరలోని డాక్టర్‌కు చూపించాలి. టపాసుల్లో ఉన్న కెమికల్స్ శ్వాసకోశ సమస్యలు పెంచుతాయి. అలర్జీలు ఉన్న పిల్లలను బయటకు పంపకూడదు. గది తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

డెర్మటాలజిస్ట్ డాక్టర్ కె.రామకృష్ణ



ప్రజాశక్తి - నరసాపురం

ఆనందదాయకమైన దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలని డెర్మటాలజిస్ట్ డాక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పండగ సమయంలో కాలిన గాయాల కేసులు పెరుగుతున్నాయని, జాగ్రత్తలు పాటించడం ద్వారా నివారించవచ్చని చెప్పారు. చిన్న పిల్లలను టపాసులతో ఒంటరిగా వదిలి పెట్టకూడదని, సింథటిక్ కంటే కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని తెలిపారు. కంటికి ఏమైనా గాయమైతే వెంటనే సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో దగ్గరలో రెండు బక్కెట్ల నీరు ఉంచుకోవడం మంచిదన్నారు. చేతితో టపాకాయలను వెలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కంటికి గాయమైతే కంటిమీద ఎటువంటి ఒత్తిడి పెట్టకూడదని, దాన్ని ముట్టుకోవడం, నలపడం చేయకూడదని వివరించారు. బాణసంచా గాయాలకు 10 నుంచి 15 నిమిషాలు చల్లని నీరు వేయాలి. యాంటీసెప్టిక్ క్రీమ్ లేదా పచ్చి గుడ్డులోని తెల్లసొనను ఒయాలి. టూత్‌పేస్టు లేదా పసుపు పూయొద్దు. కాలిన గాయాన్ని శుభ్రమైన, మెత్తటి వస్త్రం లేదా ప్లాస్టిక్ చుట్టుతో సున్నితంగా కప్పండి. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లండి.

పేదల సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా నాయకులు రాజు



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ముసునూరు

ఇంటి స్థలం లేని నిరుపేద కుటుంబానికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి నూతన ఇంటి నిర్మాణం చేపడతామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండేళ్లు కావస్తున్నా నేటికి ఆ విషయం పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులోని తహాశీల్దార్ కార్యాలయం వద్ద గత వారం రోజుల నుంచి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలతో ఆయన ఆదివారం మాట్లాడారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుళాయిలు లేవని, విద్యుత్ సదుపాయం, రోడ్లు లేవని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కోట్ల రుపాయిలు ఖర్చుపెట్టి ఊరికి దూరంగా ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి అప్పటి నాయకులు లబ్ధి పొందారన్నారు. ఆ స్థలాలు నివాసానికి ఉపయోగకరంగా లేవని చెప్పారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ గురించి మాట్లాడకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రూ.రెండు వేలు నగదు కట్టిన లబ్ధిదారులతో పాటు, నివాసం ఉంటున్న వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు.

సిబ్బంది, మృతుల కుటుంబాల సంక్షేమమే లక్ష్యం

డిజిటల్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట

ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్

రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా..





ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో అశువులు బాసిన అమర సేవకుల కుటుంబాలకు అండగా నిలబడటం, పని చేస్తున్న సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. డిజిటల్ విధానంలో పోలీసింగ్ నిర్వహిస్తూ అనేక అపరిష్కృత కేసులను సైతం ఛేదిస్తూ ముందుకు సాగుతున్న జిల్లా ఎస్‌పితో ఈ నెల 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: పోలీసుల సంక్షేమం కోసం మీరు చేపట్టిన ప్రత్యేక చర్యలు?

ఎస్‌పి: నేను విధుల్లో చేరిన తర్వాత ఇప్పటివరకు పోలీసు శాఖలో పని చేస్తూ అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. వారికి శాఖ నుండి అందాల్సిన బెనిఫిట్లన్నీ వారికి వచ్చేలా చర్యలు చేపట్టాను. గడిచిన 15 నెలల కాలంలో అమరులైన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల్లో భాగంగా ఎనిమిది మందికి నియామకపత్రాలు అందించి వారి కుటుంబ సభ్యులకు అండగా నిలిచాం. హోంగార్డు విభాగంలో గడిచిన 15 నెలల కాలంలో అమరులైన తొమ్మిది మంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాం. సిబ్బంది సంక్షేమంలో భాగంగానే పోలీస్ సబ్సిడరీ క్యాంటీన్ నిర్వహిస్తున్నాం. పోలీసుల కుటుంబాలకు ఆర్థికంగా బాసటగా నిలిచే పోలీస్ కోఆపరేటివ్ సొసైటీకి పక్కా భవనాన్ని నిర్మించాం. జిల్లాలోని దాదాపు మూడువేల మంది సిబ్బంది ఒక్కొక్కరికి వారి ఆర్థిక అవసరాల నిమిత్తం రూ.ఐదు లక్షలు ఈ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా ప్రాధాన్యతా ప్రకారం అందిస్తున్నాం. ఒక గ్యాస్ గొడౌన్‌ను పోలీసు శాఖ నిర్వహిస్తోంది. పోలీస్ డార్మెటరీ పనులను వేగంగా పూర్తి చేశాం. ప్రస్తుతం ఇది సిబ్బంది సేద తీరేందుకు సిద్ధంగా ఉంది. మహిళా, పురుష సిబ్బంది వినియోగించుకునేలా దీని నిర్మాణం చేశాం. ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో ఆయా కూడళ్లలో ప్రత్యేక క్యాబిన్లను ఏర్పాటు చేశాం. సిబ్బంది సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి మూడో శుక్రవారం పోలీసు సంక్షేమ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. పోలీసు శాఖ ఆధ్వర్యంలో రెండు పెట్రోల్ బంకులను నిర్వహిస్తున్నాం. వీటి ద్వారా వచ్చే లాభాలను సిబ్బంది సంక్షేమం కోసం ఖర్చు పెడుతున్నాం.

ప్రశ్న: జిల్లాలో నూతన పోలీసింగ్ విధానం అమలుపై సర్వత్ర చర్చ సాగుతోంది. ఆ విధానాన్ని కొంచెం వివరిస్తారా?

ఎస్‌పి: జిల్లాలో పోలీసు కేసు విచారణ విధానాన్ని, నేరస్తుల కదలికలను పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలోనే నిర్వహిస్తున్నాం. అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్లను వినియోగిస్తున్నాం. గతంలో ఒక నేరం జరిగితే ఆ నేరానికి సంబంధించిన మూలాలు వెతికి నేరస్తులను పట్టుకునేందుకు కొంత సమయం పట్టేది. ఇప్పుడు డిజిటల్ పరిజ్ఞానంతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి నేరస్తులను త్వరితగతిన పట్టుకుంటున్నాం. నేరస్తులు వెనువెంటనే పట్టుకోవడంతో ప్రజలు సంతోషిస్తున్నారు. సిబ్బందికీ శ్రమ తగ్గుతోంది.

ప్రశ్న: సైబర్ నేరాల పట్ల ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు?

ఎస్‌పి: సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు చిట్టి అనే పేరుతో ప్రత్యేక డిజిటల్ వాహనాన్ని రూపొందించాం. ఈ వాహనం సహాయంతో రూరల్ ప్రాంతాల్లో ప్రజలకు ప్రతిరోజూ అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. దీన్ని పూర్తిగా శక్తి టీమ్ నిర్వహిస్తోంది. సామాజిక మాధ్యమాల ద్వారా సైబర్ నేరాల బారిన పడ్డొద్దని ప్రత్యేకంగా కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: మహిళల భద్రత కోసం మీరు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు?

ఎస్‌పి: మహిళల భద్రత కోసం అభయ ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశాం. ప్రస్తుతం ఈ దళంతోపాటు శక్తి టీమ్‌ను ప్రభుత్వం మహిళల భద్రత కోసం ఏర్పాటు చేయడంతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో రద్దీ ప్రాంతాల్లో, కళాశాల ప్రాంగణాల వద్ద ఈ శక్తి టీమ్ మహిళలకు, విద్యార్థినులకు అండగా నిలుస్తోంది. శక్తి యాప్‌పై ప్రతిరోజూ మహిళలకు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రశ్న: జిల్లాలో నేరాల నియంత్రణ ఎలా ఉంది?

ఎస్‌పి: రౌడీషీటర్ల కదలికలపై పూర్తిస్థాయి నిఘా ఉంచి నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. నేరాలను అదుపు చేసేందుకు ప్రత్యేకంగా డ్రోన్ల సహాయంతో పోలీసింగ్ నిర్వహిస్తున్నాం. దీంతో పోలీసు సిబ్బంది వెళ్లలేని ప్రదేశాలకు సైతం క్షణాల్లో చేరుకుని అక్కడ పరిస్థితులను సమీక్షించేందుకు ప్రతిరోజూ డ్రోన్లను వినియోగిస్తున్నాం. ఈ క్రమంలో గంజాయి విక్రయించేవారు, సేవించేవారు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించేవారు, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారు, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపుదల చేసేవారిపై క్షణంల్లో చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి వేళల్లో సైతం డ్రోన్ల సహాయంతో గస్తీ నిర్వహిస్తుండటంతో నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఏలూరు నగరంలోనే కాకుండా జిల్లాలోనూ, ఇటు జాతీయ రహదారులపై పోలీసు కార్యాలయానికి అనుసంధానిస్తూ అత్యాధునిక మాట్రిక్స్ కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరస్తుల కదలికను సులభంగా గుర్తిస్తున్నాం. గతేడాదితో పోలిస్తే చోరీ కేసుల్లో రికవరీ రేటు గణనీయంగా పెరిగింది. రికవరీ చేసిన వస్తువులను నేరుగా బాధితులకు అప్పగిస్తున్నాం.

ప్రశ్న: సెల్‌ఫోన్ల రికవరీ ఎలా ఉంది?

ఎస్‌పి: నేను జిల్లాలో బాధ్యతలు చేపట్టాక ఇప్పటి వరకూ మూడుసార్లు పెద్దసంఖ్యలో సెల్‌ఫోన్లు రికవరీ చేశాం. ఆ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అందజేశాం.

ప్రశ్న: సిబ్బంది ఆరోగ్య రక్షణకు మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటీ?

ఎస్‌పి: ప్రస్తుతం విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రి సౌజన్యంతో జిల్లాలోని సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడమే కాకుండా వారికి అవసరమైన మందులను సైతం ఉచితంగా అందించాం. సిబ్బందికి అవసరమైన వైద్య సహాయాన్ని కూడా అందిస్తున్నాం. సిబ్బందే స్వయంగా శ్రమదానం చేసి వారి మానసికోల్లాసానికి దోహదపడేలా టెన్నిస్ కోర్టును నిర్మించారు.

ప్రశ్న: డాగ్ స్క్వాడ్‌కు సంబంధించి ఏమైనా వివరాలు చెబుతారా?

ఎస్‌పి: ఇప్పటివరకు డాగ్ స్క్వాడ్ చిన్న భవనంలో ఉంది. కొత్తగా కె9 పేరుతో నూతన భవనాన్ని నిర్మించాం. జిలాల్లో వివిధ కేసులను ఛేదించడంలో డాగ్ స్క్వాడ్ ఎంతగానో సహకరిస్తోంది.

ప్రశ్న: సైబర్ నేరాలపై ప్రజలకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

ఎస్‌పి: ప్రస్తుతం అన్ని వయస్సుల వారు సైబర్ నేరాలకు గురవుతున్నారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు రిటైర్డ్ ఉద్యోగులను టార్గెట్ చేసి వారిపై కేసులు ఉన్నాయంటూ వీడియో కాల్స్ ద్వారా వారిని నమ్మించి వారి ఖాతాలో ఉన్న సొమ్మును కొల్లగొడుతున్నారు. ఇటువంటి సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులను సంప్రదించండిజ లేదా సైబర్ సెల్ 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేస్తే వెంటనే సైబర్ పోలీసులు సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. ఆన్‌లైన్ లోన్లు, ఆన్‌లైన్ గేమ్‌లు, ఆన్‌లైన్ ఇన్వెస్టుమెంట్లు వంటి ఆధారంగానూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. వీటన్నింటికీ పరిష్కారం ఒక్కటే. తాము సైబర్ నేరానికి గురవుతున్నామని గుర్తిస్తే వెంటనే అత్యవసర నెంబర్లు 112కుగాని, సైబర్ సెల్ నెంబర్‌కుగాని వివరాలు తెలియజేస్తే ఎక్కువ మొత్తంలో డబ్బు పోగొట్టుకోకుండా కాపాడతారు.

జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి, అధికారులకు ప్రతి ఒక్కరికీ దీపావళి శుభాకాంక్షలు. ఈ దీపావళి మీ జీవితాల్లో కాంతులు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

బాణసంచా ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు

గొడౌన్లు, దుకాణాల వద్ద భద్రతా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు


ప్రజలందరూ ప్రమాదరహిత దీపావళిని సంతోషంగా జరుపుకునేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి ఆదివారం జిల్లాలో బాణసంచా ప్రమాదాల నివారణపై జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దీపావళి సమయంలో జిల్లాలో ఎక్కడా బాణసంచా ప్రమాదాలు సంభవించకుండా గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు ప్రతి బాణసంచా దుకాణాల వద్ద సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో లైసెన్స్ కలిగిన బాణసంచా తయారీ, నిల్వ, అమ్మకాల షాపుల వద్ద విద్యుత్, షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాల సమయంలో మంటలను ఆర్పేందుకు ఉపయోగించే పరికరాలు తప్పనిసరిగా ఉండేలా అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో 18002331077 టోల్ ఫ్రీ నెంబర్‌తో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, అదేవిధంగా అన్ని ఆర్‌డిఒ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. బాణసంచా దుకాణాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించకుండా విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ కనెక్షన్లను పరిశీలించాలన్నారు. బాణసంచా హోల్‌సేల్ షాపుల వద్ద ప్రజలు పెద్దఎత్తున గుమికూడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ బాణసంచా దుకాణాల వద్ద తప్పనిసరిగా భద్రతా చర్యలు ఉండేలా అధికారులు తనిఖీలు చేయాలన్నారు. డ్రమ్ములతో నీరు, ఇసుక బకెట్లు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, రమణ, డిపిఒ కె.అనురాధ, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నేతలు

వంతెన నిర్మాణం చేపట్టాలని ఆందోళన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వంకావారిగూడెం-జీలుగుమిల్లి ప్రధాన రహదారిపై వంకావారిగూడెం వద్ద వాగుపై కొట్టుకుపోయిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి దర్శిపాటి దుర్గారావు (ప్రభాకర్) డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గ్రామస్తులతో కలిసి కొట్టుకుపోయిన వంతెన వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం కురిసిన వర్షాలకు వరదలొచ్చి వంతెన కొట్టుకుపోయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వర్షాలు కురిసిన ప్పుడు తాత్కాలికంగా పోసిన మట్టి కూడా కొట్టుకుపోయిందని, తాత్కాలికంగా వేసిన రోడ్డు కనిపించే స్థాయికి పోయిందని, మళ్లీ కురిసిన వర్షాలకు ఆది కాస్తా కొట్టుకుపోవడంతో వంతెన అంచు మిగిలిందని, దాని పైనుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వంకావారిగూడెం, వాడపల్లి కాలనీ, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, బీమలవారిగూడెం గ్రామాల నుంచి జీలుగుమిల్లి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి అని, వంతెన లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో వంకావారిగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రముఖులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా అప్సా ఉత్తమ ఉపాధ్యాయ సన్మాన వేడుక-2025 స్థానిక డిసిఎంఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. జిల్లా నుంచి సుమారు 120 ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డు ప్రదానోత్సవం చేశారు. ముఖ్య అతిథిగా ఎస్.సూర్యచంద్రరావు, డిసిఐబి సెక్రటరీ సర్వేశ్వరరావు, అప్సా స్టేట్ ప్రెసిడెంట్ కె.తులసీవిష్ణుప్రసాద్, స్టేట్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ జంగా బాలాజీ, స్టేట్ జనరల్ సెక్రటరీ ఎంబిఎస్.శర్మ, జోన్-2 ప్రెసిడెంట్ గుణ్ణం బుల్లబ్బాయ్, జిల్లా ప్రెసిడెంట్ ఎ.శివకుమార్‌శర్మ, సెక్రటరీ ఎస్ఆర్‌కె.ప్రసాద్, ట్రెజరర్ రామకృష్ణ, అప్సా రాష్ట్ర, జిల్లా నాయకులు ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కేవలం టీచర్ల మీదే ఆధారపడి ఉందన్నారు. సమాజంలో రాజకీయ నాయకులను, ఇంజనీర్, డాక్టర్, లాయర్ ఇలా అన్ని తరగతుల వారిని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, సన్మాన గ్రహీతలు ఉండడం వారిని గుర్తించడం గర్వకారణమని తెలిపారు. తులసీప్రసాద్ మాట్లాడుతూ అప్సా అనేది ప్రభుత్వ విద్యకు సమాంతరంగా ప్రయివేట్ బడ్జెట్ విద్య సంస్థల కృషి అభినందనీయమని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

మద్యం తాగొద్దన్నారని...

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వృద్ధ తల్లిదండ్రులు మద్యం తాగొద్దన్నారని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం నగరంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని వంగాయగూడెంకి చెందిన గుడిపూడి చంద్రమౌళి (32) స్థానికంగా సెంట్రింగ్ వర్క్ చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. గతం నుంచి అతనికి మద్యం తాగే అలవాటు అధికంగా ఉంది. కుటుంబ సభ్యులు అతను మద్యం తాగకుండా పలు రోజుల నుంచి అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద కరెంటు వైర్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన బంధువులు వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఏలూరు ఒకటో పట్టణ ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్ వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్ :అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మూడో పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని నెహ్రూ కాలనీ తొమ్మిదో రోడ్డుకు చెందిన మని దుర్గాప్రసాద్ (49) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అతను ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అధిక కట్నం వేధింపులపై కేసు

ముదినేపల్లి :అధిక కట్నం కోసం వేధిస్తున్నారని తన భర్త, అత్తమామలపై భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం... మండలంలోని వాడవల్లికి చెందిన అత్తల సంధ్యకు మండలంలోని సీతారాంపురానికి చెందిన భట్టు రమేష్‌తో సంవత్సరం క్రితం వివాహమైంది. అధిక కట్నం తీసుకురమ్మంటూ భర్త రమేష్, భార్యను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడు. భర్తతోపాటు అత్త వరలక్ష్మి, మామ శోభనాద్రి ముగ్గురు కలిసి కొట్టి ఇంటి నుంచి గెంటివేశారు. సంధ్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త, అత్తమామలు అక్కడకు కూడా వెళ్లి కట్నం తీసుకురాకపోతే కాపురానికి రాకూడదు పుట్టింటి వద్దనే ఉండాలంటూ, గొడవ పడి కొట్టినట్లు విషయం పెద్దల్లో పరిష్కారం కాకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాన.. బాణసంచా దుకాణదారుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇండోర్ స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు వినియోగదారులు రాక వెలవెలపోతున్నాయి. ఒకపక్క వర్షం, మరొక పక్క శనివారం రాత్రి కురిసిన వర్షానికి మైదానమంతా వర్షపు నీరు, బురదమయం కావడంతో అమ్మకాలు లేక, వినియోగదారులు రాక దుకాణాలన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. శనివారం సాయంత్రం వరకు దుకాణదారులు వారి వారి దుకాణాలను నిర్మించుకోవడంతోనే సరిపోయింది. కర్రలతో దుకాణాలు నిర్మించుకోవడం, రేకులతో పైకప్పు ఏర్పాటు చేసుకోవడం వంటి వాటితోనే శనివారం సాయంత్రం వరకు సరిపోయింది. శనివారం సాయంత్రం నుంచి కొన్ని దుకాణాల్లో అమ్మకాలు ప్రారంభించినప్పటికీ పెద్దగా అమ్మకాలు సాగలేదు. సోమవారం దీపావళి పండుగ ఉన్న నేపథ్యంలో ఆదివారం, సోమవారం అమ్మకాలు భారీగా ఉంటాయని ఆశించిన దుకాణదారులకు నిరాశ మిగిలింది.


వర్షపు నీటిలో దుకాణాలు

శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో పాటు ఆదివారం కూడా వర్షం కొనసాగడంతో వినియోగదారులు పెద్దగా రావడం లేదు. దీనికి తోడు శనివారం రాత్రి కురిసిన వర్షానికి మైదానం అంతా నీరు నిలిచిపోయింది. అంతేకాకుండా మైదానంలో ఎక్కడ చూసినా బురదమయం కావడంతో దుకాణాల దగ్గరకు వెళ్లేందుకు కూడా సరైన దారి లేకుండాపోయింది. దీంతో వచ్చిన కొంతమంది వినియోగదారులు కూడా గేటుకు దగ్గరగా ఉన్న నాలుగైదు దుకాణాలకు మాత్రమే వెళ్తున్నారు. దూరంగా ఉన్న దుకాణాల దగ్గరకు వెళ్లాలంటే బురదలోంచి గాని, నీటిలోంచి గాని వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో ఎవరూ అటువైపు వెళ్లని పరిస్థితి ఉంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి కొంచెం వర్షం ఆగటంతో అమ్మకాలు పుంజుకుంటాయేమో అని దుకాణదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇక ధరల విషయం చూస్తే గతేడాదితో పోలిస్తే 20 శాతం వరకు పెరిగినట్లు వినియోగదారులు చెబుతున్నారు. అలాగే తయారీ విధానం నుంచే తమకు గత సంవత్సరంతో పోలిస్తే ఎక్కువ ధరకు బాణసంచా ఇచ్చారని దుకాణదారులు చెబుతున్నారు. అయితే అమ్మకాలు సరిగా లేకపోవడంతో కొన్ని దుకాణాల్లో చెప్పిన ధర కంటే కొంచెం తగ్గించి ఇస్తున్నారని, గత సంవత్సరంతో పోలిస్తే కొంచెం ధరలు పెరిగినప్పటికీ భారీగా పెరగలేదని కొంతమంది వినియోగదారులు చెబుతున్నారు. మొత్తం మీద అనుకున్న స్థాయిలో అమ్మకాలు లేక దుకాణదారులు, ధరల పెరుగుదలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి మాత్రం ఉంది. పండుగ రోజైన సోమవారం కూడా వర్షం పడితే అమ్మకాలు దారుణంగా పడిపోతాయని, రూ.లక్షల్లో నష్టం వస్తుందని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేవూరు కాలనీని ముంచెత్తిన వర్షపు నీరు

మోటార్లతో ముంపు నీరు మళ్లింపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చేవూరు వైఎస్ఆర్ కాలనీ వర్షపు నీటితో జలమయమైంది. అసలే ముంపు నీటితో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులకు ఆదివారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షంతో కాలనీలో ముంపు సమస్య మరింత పెరిగింది. కాలనీలోని అంతర్గత రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో మోకాళ్ల లోతు నీటిలో కాలనీవాసులు రాకపోకలు సాగించారు. కాలనీలోని పల్లపు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి నీరు చేరి వస్తువులు తడిసిపోయాయి. కాలనీవాసి సుబ్బారావు ఇంట్లోకి మూడు పాములు రావడంతో కాలనీ వాసులు కొట్టి చంపారు. వారం రోజులుగా ముంపు సమస్యతో బాధపడుతున్న కాలనీవాసులకు వర్షం కూడా తోడు కావడంతో కాలనీ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మూడు గృహాల్లోకి నీరు చేరడంతో నివాసితులు ఇల్లు విడిచి సురక్షిత ప్రాంతానికి వెళ్లారు. మురుగు బోదెకు అడ్డుకట్ట వేయడంతో ముంపు నీరు బయటకు పోయే మార్గం లేక కాలనీ నీట మునిగింది. మురుగు బోదె ఏర్పాటు చేయకపోవడంతో ముంపు నీరు, వర్షపు నీటితో కాలనీ జలమయమైంది. వారం రోజులుగా ముంపు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉండడంతో రోగాలు వచ్చి


కాలనీలో నీట మునిగిన రోడ్లు

బాధపడుతున్నట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. కాలనీలోని ముంపునీటిని ఆదివారం రెవెన్యూ సిబ్బంది మోటార్ ఏర్పాటు చేసి బయటకు మళ్లిస్తున్నారు. రెండు మోటార్లు ఏర్పాటు చేసి ముంపు నీటిని తోడుతున్నారు. గ్రామ విఆర్ఓ రామసుబ్బయ్య, విఆర్ఎ రామ్‌ప్రసాద్ ముంపు నీటి మళ్లింపు పనులను పర్యవేక్షించారు. చెరువు గట్లపై కరెంట్ మోటార్లు ఏర్పాటుచేసి కాలనీలోని ముంపు నీటిని ఆక్వా చెరువుల్లోకి తోడుతున్నారు.

ముస్లిం సమైక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా అజాద్

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర ముస్లిం సమైక్య వేదిక ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ అజాద్ నియమితులయ్యారు. ఆదివారం మంగళగిరి ఈద్గా షాదిఖానాలో జరిగిన ముస్లిం సమైక్య ముస్లిం వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలా ఉద్దీన్ చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అజాద్ మాట్లాడుతూ జిల్లాలో ముస్లిం సమైక్య వేదికగా ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి హక్కుల కోసం కృషి చేస్తామన్నారు.

మీడియేటర్ల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కమిటీల్లో మీడియేటర్లుగా సీనియర్ న్యాయవాదులు, సోషల్ వర్కర్లు, న్యాయ నిపుణుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి.రామకృష్ణ తెలిపారు. దరఖాస్తులు న్యాయ సేవాధికార సంస్థల వద్ద లభిస్తాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మచిలీపట్నం న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, కార్యదర్శి, మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్‌లకు ఈ నెల 28వ తేదీ లోపు అందించాలని తెలిపారు.

ఎంఎల్‌ఎను కలిసిన యాదవ సంఘం సభ్యులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం నియోజకవర్గ యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా పి.అంకంపాలెం ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం యాదవ సంఘం సభ్యులతో కలిసి పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజును బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నాలి శ్రీనును ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు శాలువతో సత్కరించి సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలానికి చెందిన వ్యక్తికి నియోజకవర్గ అధ్యక్షుడి పదవి రావడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఆధార్‌కార్డుల్లో తప్పులతో విద్యార్థుల ఇబ్బందులు

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండలంలో ఆధార్ కార్డుల్లో నమోదైన తప్పులను సరి చేసుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఏడాది కాలంగా మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దరఖాస్తులు తిరస్కరణకు గురవుతుండటంతో పాఠశాలల్లో ఆధార్ తప్పులు ఉంటే కార్యకలాపాలు కష్టమవుతున్నాయి. దీంతో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపు సమయం దగ్గర పడటంతో చదువుకుంటున్న స్కూలు నుంచి టిసి తెచ్చుకోమని సూచిస్తున్నాయి. కాని అది విద్యార్థుల చదువును మధ్యలో ఆపేస్తుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మీసేవ కేంద్రాలకు స్పష్టమైన సర్క్యులర్ జారీ చేసి విద్యార్థుల ఆధార్ తప్పులను సులభంగా సరిచేసేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాసంఘాల జిల్లా కన్వీనర్ రమణారావు
వ్యకాస నిడమర్రు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నిడమర్రు

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన మహాసభ నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో లావేటి చంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ


వెంకటేశ్వరరావు


సత్యనారాయణ

అధ్యక్షులుగా లావేటి చంద్రరావు, అధ్యక్షులుగా ఉడ్డవోలు వెంకటేశ్వరరావు (అడవికొలను), ప్రధాన కార్యదర్శిగా (గవర సత్యనారాయణ), ఉపాధ్యక్షులుగా మీసాల శ్రీను (నిడమర్రు), సహాయ కార్యదర్శిగా గుణ్ణం రాము (భువనపల్లి), మరో ఐదుగురు కమిటీ సభ్యులు, తొమ్మిది మంది నూతన కమిటీ ఎన్నికైంది.

కుక్కునూరు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులుగా వరస మహాలక్ష్మి, షేక్ ఖాసీం ఎన్నికయ్యారు. ఆ సంఘం ఐదో మండల మహాసభ మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా మేడిపల్లి బాబు, బుర్రి రాముతో మరో పాటు


మహాలక్ష్మి


షేక్ ఖాసీం

తొమ్మిది మంది సభ్యులుగా నూతన కమిటీ ఎన్నికైంది.

ఆగిరిపల్లి మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తాడి అర్జున్‌రావు(చిన్నాగిరిపల్లి), ఏపూరి రవీంద్ర (నెక్కలం గొల్లగూడెం) ఎన్నికయ్యారు. ఆగిరిపల్లిలోని చాకిరి శివనాగరాజు(ప్రజా సంఘాల)ప్రాంగణంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆరో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.


ఆగిరిపల్లి మండలాధ్యక్ష కార్యదర్శులు

గౌరవ అధ్యక్షులుగా సత్తు కోటేశ్వరరావుతో పాటు మరో తొమ్మిది మందితో నూతన కార్యవర్గం ఎన్నికైంది.

ఘనంగా హాథిరామ్ బర్సి ఉత్సవం-మహాభోగ్

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు, దొండపాడు స్వెట్ జిమ్ సెంటర్ వద్ద ఆలిండియా బంజారా సేవా సంఘం, బంజారా భజరంగీ భేరి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ హాథి రామ్ మహా భోగ్ కార్యక్రమాన్ని ధరావతు చోక్లానాయక్, అన్నపూర్ణ దంపతుల చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బాణావతు మోహన్‌రావు నాయక్ మాట్లాడుతూ బంజారాల ఆధ్యాత్మిక మార్గదర్శి శ్రీ హాథిరామ్ ఏడుకొండలపైన జీవ సమాధి అయిన త్యాగ దినాన్ని బర్సి ఉత్సవంగా జరుపుకుంటూ దేశవ్యాప్తంగా అన్ని తండాల్లో మహాభోగ్ కార్యక్రమం చేయడం బంజారాల సాంప్రదాయమన్నారు. ఎఐబిబిఎస్ సంఘ జిల్లా నాయకులు భూక్యా రమేష్ నాయక్ మాట్లాడుతూ, బంజారా భజరంగీ భేరి సంఘ జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ హాథిరామ్ చూపించిన ఆధ్యాత్మిక మార్గంలోనే అనాదిగా గోర్ బంజారాలు నడుస్తున్నారని, హాథిరామ్ మఠంలో గోర్ బంజారాల వారసత్వ హక్కులను తిరిగి కలిపించాలని, హాథి రామ్ మఠం పాలక మండలి నిర్వహణా బాధ్యతలు గోర్ బంజారాలకు అప్పచెప్పాలని ప్రభుత్వాన్ని కోరారు. బంజారా భజరంగీ భేరి జిల్లా


సత్కార కార్యక్రమంలో ప్రముఖులు

నాయకులు ధరావతు శ్రీనివాసరావు నాయక్ మాట్లాడుతూ శ్రీ హాథిరామ్ మహా భోగ్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేయాలని, తండాల్లో ఈ కార్యక్రమం చేసేందుకు ప్రభుత్వం నిధులను కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా నూతన కమిటీకి ఎన్నికైన జిల్లా అధ్యక్షులు బాణావతు మోహన్‌రావు నాయక్, రాష్ట్ర కార్యదర్శి భూక్యా గోప్యానాయక్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడిత్యా రమేష్, గుగ్గులోతు రమేష్, లావుడియా కృష్ణకిషోర్, దారావతు హనుమంతునాయక్, బోడ ప్రమీల, భూక్యా జ్యోతి, బాణావతు దేవి, దారావతు అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పేదల ఆరోగ్యానికి భరోసా, అవసరార్థులకు ఆర్థిక సాయం అందించాలనే సిద్ధాంతాలనే మౌలిక సూత్రాలతో మొక్కవోని దీక్షతో మంచిచేసేందుకు పట్టుదలతో ముందుకెళ్తున్నామని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న 33 మందికి రూ.17,246 విలువైన సిఎం సహాయ నిధి చెక్కులను అందించారు. వారికి ధైర్యం చెప్పారు. అలాగే ఒకరికి ట్రై సైకిలు, నలుగురికి తోపుడు బండ్లు, కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఒకరికి రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని ఎంఎల్‌ఎ బడేటి చంటి అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎవరైనా, ఎప్పుడైనా తనను కలవవచ్చని, తమ సమస్యలు విన్నవించవచ్చని సూచించారు. ఇప్పటివరకు ఏలూరు నియోజకవర్గంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 316 మంది బాధితులకు సిఎం సహాయ నిధి చెక్కులు, ఎల్‌ఒసిల ద్వారా రూ.3,48,87,698 అందించి భరోసా కల్పించినట్లు వెల్లడించారు. దీంతోపాటు దాతల సాయంతో కేన్సర్ పేషెంట్లకు ఆర్థిక భరోసా అందిస్తున్నామన్నారు. మరోవైపు పేదలు స్వశక్తితో తమ కాళ్లమీద తాము నిలబడాలనే మంచి ఆలోచనలతో ఇప్పటివరకూ 50 తోపుడు బళ్లను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు

భీమడోలు : ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న 28 మందికి మంజూరైన సిఎం సహాయనిధి లబ్ధిని ఆదివారం అందించినట్లు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. వీరందరికీ ఆప్కాబ్ ఛైర్మన్ సిఫారసు మేరకు లబ్ధి విడుదలైందని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. దీనిలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని భీమడోలు మండలానికి చెందిన పది మంది, గణపవరం మండలానికి చెందిన ఏడుగురు, నిడమర్రు మండలానికి చెందిన ముగ్గురు, ఉంగుటూరు మండలానికి చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.13.55 లక్షలు మంజూరయ్యాయి. వీటిని ఆయా మండలాలకు చెందిన టిడిపి, కూటమి నాయకుల సమక్షంలో భీమడోలు టిడిపి కార్యాలయంలో

పలుచోట్ల సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ శేషగిరి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.

దెందులూరు :కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పాలన పట్ల ప్రజలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని, అదేవిధంగా ప్రభుత్వం కూడా ప్రజల నమ్మకాన్ని నిజం చేస్తూ వారికి అన్నివిధాలా అండగా నిలుస్తుందని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తూ నియోజకవర్గ పరిధిలోని పలువురికి ఎంఎల్‌ఎ చొరవతో సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందించారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంఎల్‌ఎ ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బాణసంచా దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు సర్కిల్ పరిధిలోని ప్రజలకు సిఐ యుజె విల్సన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. నియమ నిబంధనలకు అనుగుణంగా, పర్యావరణహితంగా, ఆనందోత్సాహాల మధ్య పండుగను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారులు దీపావళి మందులను, సామగ్రి కాల్చే సమయంలో పెద్దలు వారిని పర్యవేక్షించాలన్నారు. అపాయాలకు చోటు ఇవ్వని తరహాలో వారు మందులను కాల్చేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం దీపావళి పండుగ నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం భీమడోలులో ఏర్పాటు చేసిన మందు గుండు సామగ్రి విక్రయశాలలను ఆయన తనిఖీ చేశారు. తనిఖీల్లో విద్యుత్, రెవెన్యూ, అగ్నిమాపక కేంద్ర అధికారులు పాల్గొన్నారు. భీమడోలు గ్రామంలో అనుమతి పొందిన ఆరు మందు గుండు విక్రయశాలల నిర్వాహకులతో సామగ్రి అమ్మే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించామన్నారు. ఏర్పాటులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయించొద్దు

ప్రజాశక్తి - ముదినేపల్లి

లైసెన్స్ లేకుండా మందుగుండు సామగ్రి విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ వివిఎస్.వీరభద్రుడు అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ మండలంలో అనధికారికంగా మందుగుండు సామగ్రి నిల్వ చేసిన, విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో ఆరు, ముదినేపల్లిలో నాలుగు, దుకాణాలకు తాత్కాలిక అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. దుకాణాల వద్ద అధికారులు సూచించిన మేరకు అన్ని నిబంధనలు పాటించాలన్నారు. మండలంలో ఏ గ్రామంలోనైనా దుకాణాల్లో మందుగుండు సామగ్రి విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జిఎస్‌టి 2.0పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిఎస్‌టి సంస్కరణల కారణంగా మన దేశ ఉత్పత్తులకు ప్రపంచ స్థాయి మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నూజివీడు పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో మంత్రి పాల్గొని తాను స్వయంగా బైక్‌ను నడిపారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశపు హాలులో జరిగిన కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ జిఎస్‌టి సంస్కరణలు సామాన్యులకు ఒక వరమన్నారు. పాత జిఎస్‌టి ధరలకు వస్తువులను అమ్మే వారిని ప్రజలు ప్రశ్నించాలని, వారిపై ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జిఎస్‌టి సంస్కరణలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు, జిఎస్‌టి ఫలాలు ప్రతి కుటుంబానికి అందాలన్న లక్ష్యంతో నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ ఎం.శ్రీహరి, నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, ఫ్లోర్ లీడర్ సిహెచ్.దుర్గాప్రసాద్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, టిడిపి నూజివీడు పట్టణ అధ్యక్షులు జగదీష్, ప్రముఖులు వాసు, ప్రభు, ఆది, ఇళయరాజా, ప్రసాద్, వేణు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూజివీడు ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేది లేదు

నూజివీడు ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేది లేదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి హెచ్చరించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిఎస్‌టి అవగాహనా సదస్సు సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నకిలీ అక్రమ మద్యం అంటూ ప్రసారం చేసిన కథనాలపై మంత్రి పార్థసారధి ఘాటుగా స్పందించారు. తప్పుడు కథనాలు ప్రసారం చేసిన వారిని నేరుగా ప్రశ్నించాన న్నారు. ఎంతో చారిత్రాత్మకమైన నూజివీడు ప్రతిష్టకు భంగం వాటిల్లితే ఎట్టి పరిస్థితుల లోనూ సహించబోమన్నారు.

పట్టణంలో సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జంక్షన్ రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ఉత్సాహంగా సాగింది. ఈ ర్యాలీలో మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి కుటుంబానికి సేవింగ్స్ పెరుగుతాయన్నారు. సాధారణ ప్రజలకు ఆర్థిక భారం తగ్గి, వినియోగదారులకు లాభాలు చేకూరుతాయన్నారు. ర్యాలీలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువత, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.